క్లుప్తంగా

పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి సేవలు మరువలేనివి



తిరువూరు: వైఎస్సార్‌సీపీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా తుదిశ్వాస విడిచేవరకు సేవలందించిన టేకులపల్లి పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ శీలం కృష్ణారెడ్డి సేవలు మరువలేనివని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. సోమవారం జీకొత్తూరులో కృష్ణారెడ్డి నివాసంలో ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. ఎన్ని ఇబ్బందులెదురైనా పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలు ఎల్లకాలం ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటారని పేర్కొన్నారు. తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రా రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ధాన్యం కొనండి సారూ!



తిరువూరు: తాము దాళ్వా ధాన్యం ఆరబెట్టి రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్ర సిబ్బంది కాటా వేయట్లేదని, అకాల వర్షాలతో నష్టపోయే పరిస్థితి ఉన్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని తిరువూరు పట్టణ రైతులు సోమవారం తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఏఎంసీ ఆవరణలోని కొనుగోలు కేంద్రంలో సంచులు కోరితే సిబ్బంది లేవని చెబుతున్నారని, తాము ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకంతో ఉన్నామని పేర్కొన్నారు. వెంటనే కొనుగోలుకు తగు ఆదేశాలివ్వాలని కోరారు. సీపీఎం రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయానికి రిటైర్డు రైల్వే ఉద్యోగి డీ రమణారావు కంప్యూటర్‌ను సోమవారం బహూకరించారు. వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొనే విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కూడా ఇవ్వడానికి సాయం అందించినట్లు ఆయన తెలిపారు. గ్రంథాలయాధికారిణి శ్రీలతకు కంప్యూటర్, యూపీఎస్ అందజేశారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, షిర్డిసాయి బాబా కమిటీ సభ్యులు నారాయణరావు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ మర్లపాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల విద్యాబోధన, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. బక్కయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి హామీ పనులు



ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ పనులు మండల గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. చిలుకూరు, దాములూరు, జూపూడి, ఈలప్రోలు, కేతనకొండ, మూలపాడు తదితర గ్రామాల్లో సోమవారం పంట పొలాల్లో రహదారుల ఏర్పాటు, పంట కాలువల తవ్వకం తదితర పనులు జరుగుతున్నాయి. ఉపాధిహామీ పథకంలో ఇటీవల కాలంలో చేసిన పనులకు నగదు సక్రమంగా రాకపోవడంతో అనేక మంది కూలీలు ఉపాధిపనులు మానుకున్నారు. వ్యవసాయ పనులకు తరలివెళ్లారు. ఈమధ్య కాలంలో ఉపాధిహామీ కూలీలకు నగదు చెల్లింపులు జరగడంతో మరలా కూలీలు ఉపాధి హామీ పనులపై ఆసక్తి చూపుతున్నారు. మండల పరిధిలో సుమారు 1,654 మంది పనులకు హాజరైనట్లు ఏపీఓ ప్రమీలారాణి తెలిపారు.

8న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

తిరువూరు: ఈ నెల 8న వైశాఖ మాసం సందర్భంగా గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంధ్య సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ వ్రతాలలో దంపతులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనాలని కోరారు.

ధ్వజస్తంభాలు @ మైలవరం

- కళలు, కళాకారులకు నిలయం
- పలు ప్రాంతాల నుంచి ఆర్డర్లు
- ధ్వజస్తంభాల తయారీలో మైలవరం ప్రసిద్ధి



మైలవరంలో ధ్వజస్తంభం తయారీలో కార్మికుడు

మైలవరం: కళలు, కళాకారులకు నిలయం మైలవరం. మైలవరం గతమెంతో ఘనం. మైలవరం జమీందారులు కళలను, కళాకారులను పోషించారు. అలాగే దేవాలయాల నిర్మాణాన్ని ప్రోత్సహించారు. దేవాలయాల్లో ధ్వజస్తంభానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ముందుగా భక్తులు ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు, పూజలు చేసి భగవంతుని దర్శించుకుంటారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ధ్వజస్తంభాల తయారీకి మైలవరం ప్రసిద్ధి చెందింది.

మూడు తరాలుగా..ఇతర ప్రాంతాలకు

మైలవరంలో మూడు తరాల నుంచి రెండు కుటుంబాలకు చెందిన వారు ఈ ధ్వజస్తంభాలను తయారు చేయడం విశేషం. ఇక్కడ తయారైన ధ్వజస్తంభాలకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మంచి డిమాండ్ ఉంది. ప్రధానంగా ఖమ్మం, భద్రాచలం, కడప, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తుంటాయని ధ్వజస్తంభం తయారీదారు జమలయ్య తెలిపారు.

అడుగుకు రూ.1300 ఖర్చు..

ఇక్కడ 15 నుంచి 20 అడుగుల ధ్వజస్తంభాలు తయారు చేస్తుంటారు. 20 అడుగుల ధ్వజస్తంభం తయారు చేయడానికి 150 కిలోల ఇత్తడి రేకులు అవసరమవుతాయి. ధ్వజస్తంభం తయారు చేయడానికి అడుగుకు మెటీరియల్, కూలీ కలిపి రూ.1300 అవుతుందని, ఒక ధ్వజస్తంభం తయారు చేయడానికి 15 నుంచి 20రోజులు పడుతుందని జమలయ్య తెలిపాడు. తయారైన ధ్వజ స్తంభాన్ని దేవాలయానికి సంబంధించిన వారే వచ్చి తీసుకు వెళుతుంటారని, దాని వలన తమకు ట్రాన్స్‌పోర్టు ఇబ్బంది ఉండదన్నారు.



మైలవరం దేవాలయంలో ధ్వజస్తంభం (ఇన్‌సెట్) ధ్వజస్తంభం తయారీకి వినియోగించే విడి భాగాలు

ఇది శ్రమతో కూడిన పని..

దేవాలయాల్లో ప్రతిష్ఠించే ధ్వజస్తంభాల తయారీ శ్రమతో కూడిన పని. ఓపికతో పనిచేయాల్సి ఉంటుంది. ధ్వజస్తంభం శిఖరం, పీఠం తయారీలో నగిషీ పని అత్యంత కీలకం. ముందుగా ధ్వజస్తంభం విడి భాగాలు తయారు చేసి ఆ విడి భాగాలను కలపాలి. భాగాలు కలపడంలో చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఆర్డర్ వచ్చిన తరువాత తయారు చేసి దానిని ప్రతిష్ఠించే ముహూర్తం సమయానికి ముందుగా వారికి అందజేస్తాం. వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తి. ముందుగా మెటీరియల్‌కు కొంత పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. మా వృత్తి చేసే వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.



– ఎస్.జమలయ్య, కళాకారుడు, మైలవరం

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపండి

- సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్
- మీకోసంలో అర్జీల స్వీకరణ

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన అర్జీదారులకు నాణ్యతతో కూడిన పరిష్కారం అందించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. మొత్తం 15 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఏ.సత్యన్నారాయణ, డీఎల్‌డీఓ వెంకటరత్నం, పీపీ యూనిట్ వైద్యాధికారి గంగాధరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, నూజివీడు రూరల్ ఏడీఈ పోతురాజు, సీడీపీఓ కే ధనలక్ష్మి, హెచ్ఓ ఆర్. హేమ, డీఎల్‌పీఓ సుందరి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని ఇలా..

- తన తండ్రి దేవానందం పేరున ఉన్న ఐదు సెంట్ల ఇళ్ల స్థలాన్ని పార్టీషన్ చేయకుండా తన తమ్ముడు సుధీర్‌బాబు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ప్రశ్నిస్తే తనపైన దాడి చేస్తున్నారని, బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన చట్టుమాల వరప్రసాద్ అర్జీని అందజేశారు.
- తన చిన్నకుమారుడు నాలుగురోజుల క్రితం తనను కొట్టి ఇంట్లో నుంచి బయటకు గెంటివేశాడని, ఆస్తిని కాజేయాలని చూస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆగిరిపల్లి మండలం శోభనాపురానికి చెందిన మూడి వడ్డీకాసులు అర్జీని అందజేసింది.
- తనకు తాత గారి నుంచి సంక్రమించిన నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో 38 సెంట్ల భూమి ఉందని, అయితే ఆ భూమిని గ్రామానికి చెందిన మందపాటి గంగాధరరావు, మందపాటి నాగమణి, మందపాటి రమణయ్య, గోళ్ల శ్రీను దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని, రక్షణ కల్పించాలని మందపాటి నాగలక్ష్మి అర్జీని అందజేశారు.



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు తీసుకుంటున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

ధాన్యం కొనుగోలులో విఫలమైన ప్రభుత్వం

మైలవరం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు విభాగం మండల అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి తెలిపారు. రెడ్డిగూడెంలో ధాన్యం రాశులు గత రాత్రి కురిసిన వర్షానికి పూర్తిగా తడిచిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైస్ మిల్లర్లు, దళారులు కుమ్మక్కయి రూ.1730 కొనాల్సిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందని రూ.1300 నుంచి రూ.1350కే కొనుగోలు చేస్తున్నార్నారు. లేకుంటే 5 కిలోలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు రోడ్డు ఎక్కాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ధాన్యం సంచులు సకాలంలో అందజేశారన్నారు. రవాణా సౌకర్యం కూడా ఏర్పాటు చేసి, హమాలీ కూలీ కూడా ప్రభుత్వమే చెల్లించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతును నిర్లక్ష్యంగా రోడ్డు మీద పడేసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సంచులు ఇచ్చి, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రవాణ సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి కుప్పిరెడ్డి వరప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ మాజీ సొసైటీ అధ్యక్షుడు గుడిసె ప్రభాకరరెడ్డి, పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, యువజన నాయకుడు గుంటక కులదీప్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెంలో ధాన్యం రాశిని పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి, ప్రభాకరరెడ్డి తదితరులు

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

నూజివీడు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. అనంతరం పుస్తక సమీక్ష చేశారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్ర చెప్పారు. పర్యావరణ పరిరక్షణను వివరించారు. అనంతరం విద్యార్థులతో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చనుబండలో పుస్తక పఠనం..

చాట్రాయి: చనుబండ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

రసాయన శాస్త్రంపై అవగాహన ఉండాలి

మైలవరం: ఒకే రకమైన పరమాణువుల కలయిక వలన ఏర్పడిన శుద్ధ పదార్థమును మూలకం అంటారని మైలవరం ఎమ్‌బీఎమ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డి. శరత్‌బాబు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు రసాయన శాస్త్రంలో మూలకాలు అనే అంశంపై సోమవారం వివరించారు. మూలకం అనే పదాన్ని ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త రాబర్ట్ బాయిల్ అని మూలకాల సంకేతాలను ఆంగ్ల మొదటి అక్షరాలతో సూచిస్తారని వివరించారు. విద్యార్థులు మూలకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడులోని గ్రంథాలయంలో డ్రాయింగ్ వేసిన విద్యార్థులు

సీడ్ మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు, కౌలు రైతులు.

నూజివీడు: న్యూజెన్ కంపెనీకి చెందిన సీడ్ మొక్కజొన్న పంటను సాగుచేసి నష్టపోయిన నూజివీడు మండలం బోర్వంచకు చెందిన 30 మంది పేద రైతులకు కంపెనీ తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులతో కలిసి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు ప్రాంతంలో మొక్కజొన్న విత్తన కంపెనీలు రైతుల్ని తీవ్రంగా నష్టపరుస్తున్నప్పటికీ వ్యవసాయ అధికారులు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 మంది పేద రైతులు విత్తన కంపెనీల ఆర్గనైజర్ల మాటలు నమ్మి 68 ఎకరాల్లో విత్తన మొక్కజొన్నను సాగు చేశారని.. తీరా చూస్తే కేవలం ఐదు క్వింటాళ్ల నుంచి టన్నున్నర వరకు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. ఎకరాకు రూ.30 వేలు చెల్లించి కౌలుకు తీసుకొని సాగు చేశారని, పెట్టుబడులు కూడా రాని పరిస్థితిలో రైతులు అప్పుల్లో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో స్థానిక మంత్రి కొలుసు పార్థసారథి జోక్యం చేసుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ బోర్వంచ గ్రామ కౌలు రైతులు పంట నష్టపరిహారం కోసం కంపెనీ వారిని అడుగుతుంటే స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు అర్జీని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేంద్రరావు, కూచిపూడి నాగేశ్వరరావు, భూక్యా రంగారావు బాధిత రైతులు పాల్గొన్నారు.

- **ఆర్డీవోకు ఆర్టీసీ ఉద్యోగుల వినతి**



తిరువూరు: తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్టీసీ డిపో కార్మికులు సోమవారం ఆర్డీవో మాధురికి వినతిపత్రం సమర్పించారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

- **తహసీల్దార్‌కు విన్నపం**

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్య నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వివరించారు. సమస్యలు పరిష్కరించేలా సూచనలు చేయాలని సోమవారం వినతిపత్రం అందజేశారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయకుండా ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తోందని అసోసియేషన్ డిపో ఉపాధ్యక్షుడు బీఎస్ రావు తహసీల్దార్‌కు వివరించారు. పాత వైద్య విధానం, ప్రమోషన్లు, మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్‌లు అమలు చేసి గ్యారేజీలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

- **ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు విఘాతం**

మైలవరం: దశాబ్దాల నుంచి అమలులో ఉన్న గ్రామీణ/పట్టణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు విఘాతం ఏర్పడుతుందని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు కే భానుమూర్తి తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల స్థానంలో కేవలం 1,2 తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. 8 లేక 9 రకాల పాఠశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వం పథక రచన చేస్తుందన్నారు. ఒక్కొక్క రకమైన పాఠశాలలో ఒక్కొక్క విధంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తులను సూచిస్తుందని, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కూడా శాస్త్రీయమైన రీతిలో సబ్జెక్టు టీచర్లను నియమించవలసిన ఆవశ్యకత ఉందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు గత కొన్ని సంవత్సరాలుగా ఆర్థిక సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రాథమిక పాఠశాల అంటే 1 నుంచి 5 తరగతులలో మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలనే కొనసాగించాలని, ఇప్పటికే ఉనికిలో ఉన్న 6 నుంచి 10 లేక 12 తరగతుల ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని,ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని వినతి పత్రాన్ని తహసీల్దారు అబ్దుల్ ధారియకు అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

- **విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించండి**

నూజివీడు: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పాఠశాల, కళాశాల పేరుతో ముద్రించిన పుస్తకాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని, దీంతో మధ్య, దిగువ తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్ఐఓ స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

- **జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక**

మైలవరం: జాతీయ స్థాయి లో నెల్లూరులో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కే నరసింహారావు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి సోమవారం తెలిపారు. ఈ నెల సోమవారం నుంచి పోటీలు ప్రారంభం కాగా 9వ తేదీ వరకు జరుగుతాయి. నెల్లూరు విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో జరిగే సాఫ్ట్‌బాల్ పురుషుల ఆల్ ఇండియా ఇంటర్ యూ నివర్శిటీ పోటీల్లో కృష్ణ యూ నివర్శిటీ తరఫున పాల్గొనేం దుకు బీకాం మూ డవ సంవత్సరం చదువు తున్న కే నరసింహారావు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నేస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

- **ఆలయాల భూములకు వేలం ఖరారు**

ఇబ్రహీంపట్నం: మండలంలోని దాములూరు, చిలుకూరు, కాచవరం గ్రామాల్లోని పలు ఆలయాలకు దేవదాయ శాఖ అధికారులు సోమవారం టెండర్ కం వేలం నిర్వహించారు. ఏడాది కాలానికి వేలం ఖరారు చేశారు. దాములూరులో శ్రీకోటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 15.11 ఎకరాలకు ముగ్గురు వ్యక్తులు రూ.3,83,500కు వేలం దక్కించుకున్నారు. చిలుకూరు శ్రీమల్లేశ్వరస్వామి దేవాలయ భూములు 16.78 ఎకరాలు రూ.1,86,500 నగదుకు గ్రామస్తులు వేలంలో దక్కించుకున్నారు. కాచవరం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం భూములు 21.74 ఎకరాలకు అధికారులు ఆశించిన స్థాయిలో వేలం జరగకపోవడంతో వాయిదా వేసినట్లు ఈవో అనూరాధ తెలిపారు.

సంక్షిప్తంగా...

- **14న బహిరంగ వేలం**

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో వేంచేసి యున్న శ్రీ రఘునాథస్వామి ఆలయం భూములకు, శ్రీ రామకృష్ణ పబ్లిక్ ట్రస్టుకు చెందిన వ్యవసాయ భూముల కౌలు హక్కులకు ఈనెల 14న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి గాను ఆలయ ప్రాంగణంలో ఆరోజు ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

- **నేడు వైఎస్సార్ సీపీ నిరసన**

తిరువూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ కూటమి ప్రభుత్వం విపరీతంగా పెంచిన కరెంటు చార్జీలను రద్దు చేయాలని కోరుతూ తిరువూరు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ ఆందోళనా కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

- **అరుణాచలంకు ప్రత్యేక బస్సు**

తిరువూరు: ప్రసిద్ధపుణ్యక్షేత్రం అరుణాచలంకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 10న తిరువూరు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు తిరువూరులో బస్సు బయలుదేరి 11న కాణిపాకం, శ్రీపురం దర్శనానంతరం ఆదివారం రాత్రి పౌర్ణమి వేళకు అరుణాచల క్షేత్రం చేరుతుందని తెలిపారు. గిరిప్రదక్షిణ అనంతరం 12న కంచి, తిరుత్తణి దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో 13న శ్రీకాళహస్తి మీదుగా తిరువూరు చేరుతుందని తెలిపారు. రాను పోను ఒక్కొక్కరికి రూ.2800 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్లో 95184 సర్వీసు నంబరుతో అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 73824 87969, 98856 61835 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

- **జనన ధ్రువపత్రాలు త్వరగా ఇవ్వాలి**

తిరువూరు: విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి అవసరమైన జనన ధ్రువపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం. రాంప్రదీప్ సోమవారం తిరువూరు ఆర్డీవో మాధురికి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అపార్ కార్డులు జారీచేయడానికి సైతం జనన ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకున్నందున వీటి జారీలో జాప్యాన్ని నివారించాలని కోరారు.

- **మూడేళ్ల కాలపరిమితి విధానం రద్దు చేయండి**

తిరువూరు: వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వెలుగు యానిమేటర్ల సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఏ.కమల కోరారు. తిరువూరు సుందరయ్య భవన్లో సోమవారం వీవోఏల తిరువూరు డివిజన్ సమావేశం జరిగింది. కార్మిక చట్టాల్లో సవరణలు రద్దు చేయాలని కోరారు. కాలపరిమితి సర్క్యులర్‌లు రద్దుచేయాలన్నారు. ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న వీవోఏలు దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, కుమారి, వెంకటేష్ పాల్గొన్నారు.

- **చోరీలపై అప్రమతంగా ఉండాలి**

చాట్రాయి: గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డి.రామకృష్ణ అన్నారు. సోమవారం తుమ్మగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘాపెట్టి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిలో చిన్న పిల్లలను చెరువులు, కాలువల వైపు వెళ్లకుండా ఎండలో తిరగకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొవద్దని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకూడదని, క్రికెట్ బెట్టింగ్‌లు, కోడి పందాలు చేపట్టకూడదని ఆయన సూచించారు.

- **యువకుడికి గాయాలు**

ఆగిరిపల్లి: ఆర్టీసీ బస్సు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చొప్పరమెట్లకు చెందిన పామర్తి పవన్‌కుమార్ సోమవారం ఉద్యోగం నిమిత్తం తన మోటార్‌సైకిల్‌పై విజయవాడకు వెళుతుండగా నెక్కలం గొల్లగూడెం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న కిరణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం బంధువులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

- **నేటి నుంచి ప్రత్యేక ఆధార్ సేవలు**

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెం సచివాలయంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మరలా 12 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ ఆనంద్ బాబు తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదుతో పాటు, ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ప్రజలు ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

- **వేణుగోపాలుడికి చందన అలంకరణ**

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో వైశాఖ మాసం సందర్భంగా సోమవారం స్వామివారికి చందన అలంకరణ చేశారు. వేణుగోపాలస్వామికి విశేష పూజల అనంతరం అర్చకులు ఈ అలంకరణ చేశారు. ఏటా వైశాఖమాసంలో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో సంధ్య తెలిపారు.

- **జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక**



జనార్ధన్

ఇబ్రహీంపట్నం: జాతీయ స్థాయి యోగా పోటీలకు ఇబ్రహీంపట్నంకు చెందిన లంకే జనార్ధన్ ఎంపిక య్యాడు. విజయవాడలో రాష్ట్ర యోగా కల్చర్ అసోసియేషన్, ఆర్కేస్ యోగా స్టూడియో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 40– 50 ఏళ్ల విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచాడు. జూన్ 6,7,8 తేదీల్లో కోల్‌కతాలో జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ప్రిన్సిపాల్ హరితామాధవి నుంచి సర్టిఫికెట్, మెడల్ అందుకున్నారు. పలువురు జనార్ధన్‌ను అభినందించారు.

- **నివేశన స్థలాలపై నిషేధం తొలగించాలి**

తిరువూరు: తిరువూరులోని శాంతినగర్, అశోక్‌నగర్, సుగాలీకాలనీల్లో మాన్యం భూములపై విధించిన నిషేధం తొలగించాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. 2014 నుంచి పట్టణంలోని 71 ఎకరాల్లో 350 నివేశనస్థలాల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ సీపీఎం కార్యకర్తలు ధర్నా చేశారు. పంతంగి శ్రీనివాసరావు, బలగాని వెంకటేశ్వరరావు, జీ వెంకటరత్నం, ఎస్‌వీ భద్రం, ఆకుల రవి, సాంబారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.